## క్లుప్తంగా

### అనిల్‌పై కక్ష సాధిస్తే సహించం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నెల్లూరు రూరల్: ఆధారాల్లేకుండా కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసం మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను అరెస్ట్ చేస్తే సహించేది లేదని రాష్ట్ర యాదవ మహాసభ నాయకుడు యనమల నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశం ఆయన నిర్వహించారు. ఏమైనా తప్పులు జరిగి ఉంటే సరైన విచారణ వేసి చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమన్నారు. అకారణంగా అనిల్‌ను ఇబ్బంది పెడితే యాదవ సమాజం సహించదన్నారు. సరైన ఆధారాలు కారణాలు చూపకుండా అక్రమంగా అరెస్ట్ చేస్తే ప్రజలు తిరగబడి ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

### వడ్డెరలకు రక్షణ కరువు


మాట్లాడుతున్న దయాకర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వంలో వడ్డెర కులస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ ఆరోపించారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డు వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తలుపుల మండలం రాజనాలపల్లికి చెందిన పల్లెపు నవీన్‌పై ఓ వర్గానికి చెందిన వారు తప్పుడు దొంగతనం కేసు పెట్టారన్నారు. అవమానం భరించలేక నవీన్ సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. అబద్ధపు కేసు పెట్టిన సీఐ, ఎస్సైలపై కేసు నమోదు చేసి విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు శాంతిభద్రతలను అదుపు చేయలేకపోతున్నారని ఆరోపించారు. వెంకటేష్, బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### డాక్టరేట్ ప్రదానం


నాగేశ్వరమ్మను అభినందిస్తున్న దృశ్యం

నెల్లూరు(టౌన్): నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ సెల్‌లో పనిచేస్తున్న కూనపరెడ్డి పద్మావతి నాగేశ్వరమ్మకు డాక్టరేట్ లభించింది. కృష్ణా యూనివర్సిటీలో ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.పద్మజ పర్యవేక్షణలో స్టీల్ ఇండస్ట్రీలో ఉద్యోగుల ఉత్పాదకతపై శిక్షణా కార్యక్రమాల ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. శుక్రవారం కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, డీన్ విశ్వక్‌సేన్‌రెడ్డి అభినందించారు.

### ప్రహరీ కూల్చివేతపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మెడికల్ కళాశాల ఉత్తరం వైపు ప్రహరీ కొంత భాగాన్ని గుర్తుతెలియని దుండగులు కూల్చివేశారని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బీసీ వెల్ఫేర్ హాస్టళ్లకు కొత్త వంట పాత్రలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రభుత్వ వసతి గృహాలకు కొత్త వంట పాత్రలను ప్రభుత్వం అందజేసిందని బీసీ సంక్షేమ శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అవి బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ నుంచి జిల్లా కార్యాలయానికి వచ్చాయన్నారు. 73 హాస్టళ్లకు సరఫరా చేస్తామని చెప్పారు. పాత్రల విలువ రూ.7.5 లక్షలు ఉంటుందన్నారు. ఫ్రెషర్స్ డే నిర్వహించాలని బీసీ సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. హాస్టళ్లలో ఈ ఏడాది చేరిన విద్యార్థులకు ఈనెల 6, 7, 8 తేదీల్లో ఫ్రెషర్స్ డే నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు వార్డెన్లకు ఆదేశాలిచ్చామన్నారు.

### 7న జిల్లా స్థాయి శిక్షణా తరగతులు

నెల్లూరు(టౌన్): అక్షరాంధ్రా (ఉల్లాస్) జిల్లా స్థాయి శిక్షణా తరగతులు ఈనెల 7వ తేదీన జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి ఎం.మస్తాన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి వివిధ శాఖల జిల్లా అధికారులు విచ్చేస్తున్నట్లు వెల్లడించారు. మండల అభివృద్ధి అధికారులు, ఎంఈఓలు, డీఆర్‌డీఏ ఏపీఎంలు, ఏపీఓలు, మెప్మా సిబ్బంది, ప్రతి మండలం నుంచి ఒక ఉపాధ్యాయుడు, వయోజన విద్యాశాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

# మీ సేవలు అమూల్యం : ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్): 'క్రమశిక్షణ, అంకితభావంతో మీరు సుదీర్ఘకాలం అందించిన సేవలు అమూల్యం. ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో శేష జీవితం సంతోషంగా గడపాలి' అని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖలో ఏఏఓగా పనిచేస్తున్న షేక్ ఖతీజా బేగం, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, ఏఎస్సైలు జీఆర్పీ రామరాజు, డి.హరేంద్రబాబు, పి.జనార్దన్ శ్రీనివాస్, ఏఆర్ ఎస్సైలు వి.శ్రీహరి, షేక్ షౌకత్‌బాషా, సి.చంద్రశేఖర్‌రెడ్డిలు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. శుక్రవారం స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీ వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సమావేశంలో నగర, రూరల్, ఎస్బీ, ఏఆర్ డీఎస్పీలు పి.సింధుప్రియ, జి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఎస్.చంద్రమోహన్, ఏఓ చంద్రమౌళి, డీటీసీ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన వారితో ఏఎస్పీ సౌజన్య, అధికారులు

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటాం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగరంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటామని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్యనారాయణ హెచ్చరించారు. నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో వాటర్ ట్యాంక్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించి మాట్లాడారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గతంలో స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తే వాటిని పగులగొట్టాలని చెప్పిన లోకేశ్, పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై అదే మీటర్లను ఏర్పాటు చేయించడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే సామాన్యులకు విద్యుత్ అందుబాటులో ఉండదన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, నరసింహ, మురళి, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకుమారి తదితరులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

# స్మార్ట్ స్ట్రీట్ వెండర్ పనుల పర్యవేక్షణ

నెల్లూరు(బారకాసు): స్థానిక మైపాడు గేటు జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలో జరుగుతున్న స్మార్ట్ స్ట్రీట్ వెండర్ పనులను శుక్రవారం అధికారులతో కలిసి కమిషనర్ వైఓ నందన్ పర్యవేక్షించారు. తొలుత స్థానిక 36వ డివిజన్ బ్రహ్మానందపురం, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో పెన్షన్ పంపిణీ ప్రక్రియలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 27 మంది జోనల్ ఇన్‌చార్జిలు తమకు కేటాయించిన సచివాలయాల్లో పెన్షన్ పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ రహంతు జానీ, డీఈఈ రఘురామ్, సిబ్బంది పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కమిషనర్

# ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఅవుట్లలో ప్లాట్ల యజమానులకు చట్టబద్ధ హక్కులు కల్పించే ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను కొత్త నిబంధనల ద్వారా అనుమతించవచ్చని ప్రకటించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్ ,బిల్డర్లు తదితరులు పాల్గొన్నారు.

➪ కమిషనర్ నందన్ వెంగళరావునగర్ తాతయ్యబడి మున్సిపల్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, హాజరు, మధ్యాహ్న భోజన సదుపాయం తదితర అంశాలను పరిశీలించారు. కార్పొరేటర్ అవినాష్, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ నందన్

➪ 32/2 ఎన్‌బీటీ కాలనీ వార్డు సచివాలయాన్ని కమిషనర్ నందన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని కార్యదర్శులక సూచించారు. ఆస్తి, తాగునీటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్ నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

# శిశువుకు తల్లిపాలు అమృతం

నెల్లూరు(అర్బన్): శిశువుకు తల్లిపాలు అమృతం లాంటివని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సర్దార్ సుల్తానా అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక దర్గామిట్టలోని తల్లీబిడ్డ విభాగం ఎస్‌ఎన్‌సీయూ వార్డులో శుక్రవారం తల్లులకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ బిడ్డకు వ్యాధినిరోధకత శక్తి పెరిగేందుకు తల్లిపాలు తప్పనిసరి అన్నారు. పిల్లలకు డబ్బాపాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ నుంచి డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, చిన్నపిల్లల డాక్టర్లు సురేష్‌బాబు, డా.లక్ష్మీప్రసన్న, డా.రమాదేవి, డా.హేమంత్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో మాట్లాడుతున్న డాక్టర్

**నారాయణలో..**

నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన చిన్నపిల్లల విభాగం, గైనకాలజీ, ఎస్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి దొరసానమ్మ జ్యోతి ప్రజ్వలన చేశారు. గర్భిణులు, కాన్పు జరిగిన తల్లులు, ఇతర మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దొరసానమ్మ మాట్లాడుతూ పాలు పట్టిస్తే అందం తగ్గిపోతుందనో.. లేదా ఇతర అపోహలతో డబ్బాపాలు బిడ్డకు పట్టించడం మంచిది కాదన్నారు. బిడ్డకు తొలి ఔషధం తల్లిపాలేనన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ సాంబశివారెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, ఆపరేషన్స్ ఏజీఎం డా.మంజుప్రభ, ఎస్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కార్తీక్, ఆస్పత్రి ఏజీఎం ఏసీశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీఓ అరుణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు శ్యామల, పరిమళ కుమారి, వాణి, నాగలక్ష్మి, సుజాత, స్వరాజ్యం, నాగమల్లీశ్వరి, పద్మజ, పద్మ పాల్గొన్నారు.


నారాయణలో మాట్లాడుతున్న దొరసానమ్మ


వెంకటేశ్వరపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో..

# ఆధ్యాత్మిక యాత్రకు రైల్వే రాయితీలు

నెల్లూరు రూరల్: ఆధ్యాత్మిక యాత్రకు రైల్వే రాయితీలు ఇస్తున్నట్టు ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో వివరాలు వెల్లడించారు. యాత్ర సెప్టెంబర్ 9వ తేదీన చెన్నై నుంచి ప్రారంభమై 14 రోజులపాటు కొనసాగుతుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, ఖాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు. ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు, సౌత్ స్టార్ రైలు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపుతో దీనికి శ్రీకారం చుట్టామన్నారు. ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, మధుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసి, గయ వంటి పవిత్ర పుణ్యక్షేత్రాల దర్శించుకునే వీలుంటుందన్నారు. ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. టికెట్లను www.tourtimes.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 93550 21516 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న విఘ్నేష్

# న్యాయశాఖ ఉద్యోగులకు వీడ్కోలు సన్మానం

నెల్లూరు(లీగల్): న్యాయశాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన పురిణి చంద్రశేఖర్, అళ్ల అరుణను శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో సన్మానించారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. శ్రీనివాస్, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యప్పరెడ్డి ఉద్యోగులను శాలువాతో సన్మానించారు. బాల గాయకుడు అజిత్‌రామ్ పాటలు పాడి ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో వివిధ కోర్టుల న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజయాదవ్, ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటసునీల్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రశేఖర్ దంపతులను సన్మానిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

# ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక చర్యలు

నెల్లూరు(పొగతోట): రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతున్నామని డీఎస్ఓ విజయకుమార్ అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో రైస్‌మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో వరికోతలు ప్రారంభమయ్యే అవకాశముందన్నారు. ఈలోగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు దృష్టి సారిస్తున్నామన్నారు. సీఎంఆర్‌కు సంబంధించి మిల్లుల జాబితా సేకరిస్తున్నామన్నారు. బ్యాంక్ గ్యారెంటీ సేకరించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాట్లాడుతున్న డీఎస్ఓ విజయకుమార్

# పురస్కారాల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ఆదివారం కళాంజలి సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కళాంజలి అనంత్ తెలిపారు. నగరంలోని గానం అకాడమీలో శుక్రవారం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత్ మాట్లాడుతూ నెల్లూరీయులైన ప్రముఖ సినీ రచయిత, డాక్టర్ రాజేంద్రకుమార్, సినీ సంగీత దర్శకుడు జయక్రిష్, హైదరాబాద్‌కు చెందిన తెలుగు ఇండియన్ ఐడల్ గాయిని ఎల్.కీర్తనకు అవార్డులు అందజేస్తామన్నారు. ఇంకా వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న గాయకులు 98489 59575 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. అలాగే రాత్రి 8 గంటలకు స్వరఝరి జరుగుతుందన్నారు. దువ్వూరు బెనర్జీ, ఎ.లక్ష్మీప్రసన్న, ఎస్.కృష్ణకుమార్ పాల్గొన్నారు.


ఆహ్వానపత్రికల ప్రదర్శన

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33/11 కేవీ ఎంజీ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఎమ్మెస్సార్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్నందున శనివారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మానందపురం, డీఈఈ కార్యాలయం, బెజవాడ ఓబుల్‌రెడ్డి నగర్, రాజగోపాలపురం, బొల్లినేని ఆస్పత్రి, జీటీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తారని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

### దరఖాస్తుల గడువు పొడిగింపు

నెల్లూరు రూరల్: అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అర్హులకు అందజేసేందుకు జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేసేందుకు దరఖాస్తుల గడువును డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించినట్లుగా జేసీ కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అందించే ఈ సేవలు పూర్తిగా ఉచితమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సర్వేపై అవగాహన పెంచుకోండి

నెల్లూరు(బారకాసు): అధునాతన డ్రోన్ సాంకేతిక విధానం ద్వారా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న నక్ష సర్వే ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని కమిషనర్ నందన్ తెలిపారు. శుక్రవారం ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం నుంచి కమిషనర్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు. అనంతరం నందన్ మాట్లాడుతూ సర్వే ద్వారా పట్టణ భూమి రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తారన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న నాగార్జునరావు

నెల్లూరు(అర్బన్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి వాటిని నియంత్రించాలని జిల్లా మలేరియా నివారణ సహాయ అధికారి నాగార్జునరావు సూచించారు. శుక్రవారం నగరంలోని ఆకుతోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామికనగర్‌లో ఆయన పర్యటించారు. ఇళ్లలో నిల్వ ఉంచిన నీటి డ్రమ్ములను, తొట్టెలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది శ్యాంసన్‌బాబు, రామారావు, హెల్త్ అసిస్టెంట్ మస్తాన్, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో..

• ఆలయాల్లో శ్రావణమాస పూజలు


చందనాలంకారంలో అమ్మవారు


మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో..


రాజరాజేశ్వరి దేవస్థానంలో..


ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూలంగిసేవ, పల్లకి సేవలు జరిగాయి. అనివెట్టి మండపంలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, లక్షకుంకుమార్చన, పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు సూరావఝుల రఘురామమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం వీణా కచ్చేరి, వేదపారాయణం, సంధ్యామేళం, రాత్రి కుంభహారతులు, పల్లకి సేవ విశేషంగా జరిగాయి. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి పర్యవేక్షించారు.

➪ సింహపురి గ్రామదేవత శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు విశేష అలంకారంలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, పూలంగిసేవ, చందన అలంకారం, పల్లకిసేవలనునిర్వహించారు. కార్య నిర్వహణాధికారి విరుపావఝుల గిరికృష్ణ పర్యవేక్షించారు.

➪ బాలాజీనగర్ శ్రీసీతారామ స్వామి మందిరంలో సీతమ్మ వారికి పల్లకిసేవ, సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆ మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, అమరా మోహన్‌రావు, ఎస్.హనుమంతరావు తదితరులు పర్యవేక్షించారు.

➪ మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో పల్లకిసేవ, ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

➪ ఏసీనగర్ కోదండరామపురంలోని శ్రీమహాలక్ష్మి దేవస్థానంలో సామూహిక కుంకుమపూజ జరిగింది. అమ్మవారు చందన అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి పూలంగిసేవ వేడుకగా జరిగింది. పాలకమండలి కమిటీ చైర్మన్ పత్తినరసింహం పర్యవేక్షించారు.

➪ సుజాతమ్మకాలనిలోని అవధూత దత్తపీఠం శాఖ శ్రీకృష్ణయోగమందిరం ప్రాంగణంలోని శ్రీఅష్టలక్ష్మి మందిరంలో, నవాబుపేట శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజల్ని విశేషంగా నిర్వహించారు.

➪ స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 400 మంది మహిళలు నవబాలదుర్గ కుంకుమార్చన నిర్వహించారు. చందనాలంకారంలో అమ్మణ్ణి దర్శనమిచ్చారు. కార్యక్రమాలను పాలక మండలి పర్యవేక్షించింది.

# పీ4కు సహకరించండి : డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): పీ4 కార్యక్రమానికి కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యం సహకరించాలని డీఎంహెచ్‌ఓ సుజాత కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో హాస్పిటళ్ల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్యులు, ఇతర సిబ్బంది సచివాలయ పరిధిలోని తమకు నచ్చిన పేద కుటుంబాలను దత్తత తీసుకుని సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. నారాయణ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఏవో సుధీర్ ముందుకొచ్చి ఆన్‌లైన్‌లో పేరును నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఏటీఓ డాక్టర్ ఖాదర్‌వలీ, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, డీఎస్‌ఎంఓ డాక్టర్‌స సురేంద్ర, డెమో అధికారి కనకరత్నం, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుజాత

# వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): శరీరంపై గాయాలతో గుర్తుతెలియని వ్యక్తి నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పుబుకింగ్ కౌంటర్ వద్ద శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉంటుంది. పచ్చరంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరి చందన కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

